క్లుప్తంగా

అనాథ చిన్నారులకు 'ఆదిపురుష్' ప్రదర్శన



నెల్లూరు సిటీ: కొండాయపాళెం సమీపంలోని వాత్సల్య నిరాధార ఆశ్రమంలో ఉన్న 125 మంది చిన్నారులకు ఆదిపురుష్ చిత్రాన్ని ఎమ్ – 1 థియేటర్స్‌లో ఆదివారం ఉచితంగా చూపించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారాకానాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నేతలు సీతారామారావు, సూర్యనారయణ, జ్యోతిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్ కాంప్లెక్స్‌లో 400 మంది వాకర్స్‌కు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలను స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని గ్రీన్ సిటీ గ్రూప్స్ చైర్మన్ కొండ్రాజు సుబ్బరాజు సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని అసోసియేషన్ అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ తెలిపారు. వైద్యులు కృష్ణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, అసోసియేషన్ కోశాధికారి అనంతరామారావు, మాజీ అధ్యక్షులు రంగారావు, బాసం శేషగిరిరావు, రమణయ్యగౌడ్, సాయిరామ్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ఆచార్య అకాడమీ తరగతులు



నెల్లూరు (టౌన్): గ్రూప్ – 1, 2 పరీక్షలకు సంబంధించిన తరగతులను ఆచార్య అకాడమీలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నారని గౌరవ సలహాదారుడు ఓబులేసు నందన్ పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని డీఆర్ ఉత్తమ హోటల్లో ఆదివారం నిర్వహించిన డెమో క్లాసులో ఆయన మాట్లాడారు. గ్రూప్ – 1, 2 పరీక్షలకు సంబంధించి హైదరాబాద్‌లో ఎన్నో ఏళ్లుగా ఆచార్య అకాడమీ శిక్షణను అందిస్తోందని చెప్పారు. నగరంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా బ్రాంచ్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. డైరెక్టర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు రూరల్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రూరల్ పరిధిలోని కోడూరుపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. స్థానికంగా ఉండే గున్నా నాగరాజు (35) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య దేవి, ఇద్దరు పిల్లలున్నారు. వ్యసనాలకు బానిసై కుటుంబంపై నిర్లక్ష్యంగా ఉండటంతో చెన్నైలోని తన పుట్టింటికి భార్య వెళ్లారు. కాపురానికి రావాలని పలుమార్లు ఆయన ప్రాధేయపడ్డారు. తాను రానని, పిల్లలను సైతం తన వద్దే చదివించుకుంటానని ఆమె చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు తన ఇంట్లోని ఇనుప రాడ్డుకు చీరను బిగించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు మొదటి అదనపు న్యాయమూర్తి జి.కపర్ధి తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను సజావుగా అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ డివిజన్లోని వెంకటరెడ్డినగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను ఆదివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. పలు సమస్యలను స్థానికులు తెలియజేయగా, పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): పదో తరగతిలో ప్రతిభ చూపిన నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 37 మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పురమందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పెంచలరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను సత్కరించారు. గూడూరులోని జ్ఞాననేత్ర స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన గాయకులు రాజా, శ్రీనివాస్, లావణ్య, జయలక్ష్మి, వాద్య కళాకారులు కిరణ్, వాసు ప్రదర్శించిన సంగీత విభావరి అలరించింది. ట్రస్ట్ బోర్డు సెక్రటరీ జేఎస్ రెడ్డి, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, వివేకానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



నెల్లూరు(సెంట్రల్): వేదాయపాళెం సమీపంలోని ప్రధాన రహదారి వద్ద గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేశవులునగర్ సమీపంలోని రోడ్డును ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతో బాగు చేయించామని చెప్పారు. రమణయ్య, మల్లికార్జున, కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



అమర్‌నాథ్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(పొగతోట): నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఎంప్లాయిస్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని సంస్థ వెల్ఫేర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు శివశంకర్ కోరారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి వినతిపత్రాన్ని కడపలో ఆదివారం అందజేశారు. వేతనాల పెంపు, హెచ్ఆర్ పాలసీ అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. యూనియన్ నేతలు రహంతుల్లా, జితేంద్ర, సురేష్, ప్రకాష్, చెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

6న కౌలు రైతుల సదస్సు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని పురమందిరంలో కౌలు రైతుల సదస్సును జూలై ఆరున నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి హరిబాబు పేర్కొన్నారు. బాలాజీ నగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో కౌలు రైతు సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ కార్మికుల ఉపాధి హామీ పనులు, కార్మిక చట్టాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నామని తెలిపారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, అజయ్‌కుమార్, కౌలు రైతు సంఘ నేతలు ముత్యాల గురునాథం, తుళ్లూరు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నివాళి



నెల్లూరు(వేదాయపాళెం): డీవైఎఫ్ఐ దివంగత నేతలు గోను చలపతి, మేకల చెంచయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చలపతి, చెంచయ్య 26వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నక్కలగుంటలోని వారి స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కృష్ణయ్య, శ్రీనివాసులు, కిన్నెర కుమార్, కొండా ప్రసాద్, సంపత్, నాగేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, రఘురామయ్య, పోతురాజు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): వివిధ రంగాల్లో సృజనాత్మకత కలిగిన బాలికలను ప్రోత్సహించడాన్ని నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి అభినందించారు. నెల్లూరుకు చెందిన కార్టూనిస్ట్ రామశేషు కుమార్తె మోపూరు పావని స్మారక బాల పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని న్యూ మిలటరీ కాలనీలోని శ్రీఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదీప (శాస్త్రీయ నృత్యం), ప్రశాంతి (క్రీడలు), హారిక (చిత్రలేఖనం), హర్షిత (విద్య), నందన (సంగీతం), శ్రావ్య (ఆధునిక నృత్యం)కు రూ.వెయ్యి చొప్పున నగదును అందజేసి జ్ఞాపికతో సత్కరించారు. మోపూరు పెంచలయ్య, పెంచలనరసింహం, శ్రీనివాసులు, శ్రీధర్‌బాబు, ఈతకోట సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'నారాయణ' విజయకేతనం



నెల్లూరు (టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో లోహిత్ ఆదిత్యసాయి 108, ప్రణీత్‌సాయి 175, మేఘనారెడ్డి 430, అర్జున్ 471, శ్రీవత్సవరెడ్డి 896, లలిత్‌కుమార్ 1664, మృదుల్‌కృష్ణారెడ్డి 1808, నవీన్ చంద్ 1835వ ర్యాంకులను సాధించారని చెప్పారు.

'శ్రీచైతన్య' విజయదుందుభి



నెల్లూరు (టౌన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని కళాశాల డీన్ శ్రీరామ్ పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను ఇస్కాన్ సిటీలోని కళాశాలలో ఆదివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో వెంకటసాయిపవన్ 423, సాయి 2456, ప్రహర్షిత 4377 ర్యాంకులను సాధించారన్నారు. ఐదు వేల్లోపు నాలుగు, పది వేల్లోపు 11 ర్యాంకులను సాధించారని వివరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరుని సన్నిధిలో నవాబుపేటకు చెందిన చిన్నారి భవ్యహాసిని నిర్విరామ ఐదు గంటల గిరి ప్రదక్షిణ నాట్య ప్రదర్శన విజయవంతం కావాలని పలువురు కాంక్షించారు. జూలై 16న చేపట్టనున్న ఐదు గంటల గిరి ప్రదక్షిణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సాధనలో భాగంగా మూడు గంటల నిర్విరామ నాట్య ప్రదర్శనను నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి సన్నిధిలో ఆదివారం నిర్వహించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, ప్రధానార్చకుడు కిడాంబి జగన్నాథాచార్యులు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి భవ్యహాసినికి ఆశీస్సులను అందజేశారు. దేవస్థాన పాలకమండలి మాజీ సభ్యులు రంగాచారి వెంకటేష్, శ్రీకంఠం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్‌కు సన్మానం



నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఫాదర్స్ డేను ఆదివారం నిర్వహించారు. అనంతరం నిండు నూరేళ్ల వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా జూన్‌లో జన్మించిన జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను సత్కరించారు. ఎమ్వీ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, తుంగా నారాయణ, బల రామనాయుడు, మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, కృష్ణయ్య, అనంతరావు, ఎస్తేరురాణి, హరిసుధ, ప్రసాద్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించకుండా రూ.లక్షల్లో మోసం

నెల్లూరు(క్రైమ్): అమెరికాలో ఎమ్మెస్ కోర్సు చేరేందుకు ఫీజు చెల్లిస్తామని రూ.24 లక్షలు తీసుకొని వ్యక్తిని మోసగించిన వారిపై వేదాయపాళెం పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటలో బేల్దారి పనులు చేసే నరసింహరావు కుమారుడు నరేష్‌కుమార్ చెన్నైలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అమెరికాలో ఎమ్మెస్ చదివేందుకు యత్నిస్తుండగా, అతనికి తెలిసిన నందకిశోర్ ద్వారా హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకులు ఉత్తమకుమార్, చైతన్యరెడ్డి పరిచయమయ్యారు. అమెరికాలోని కాంకర్డియా యూనివర్సిటీలో ఎమ్మెస్ కోర్సులో సీటు ఇప్పిస్తామని, ఫీజు చెల్లించేందుకు రూ.24 లక్షలివ్వాలని కోరారు. అతని మాటలు నమ్మిన నరసింహరావు కుటుంబసభ్యులు నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఈ క్రమంలో గతేడాది ఆగస్ట్ నాలుగున నరేష్‌కుమార్ అమెరికాకు వెళ్లి కళాశాలలో చేరారు. అయితే కళాశాల వారు ఫీజు చెల్లించాలని కోరడంతో, తాను ముందుగానే చెల్లించానని చెప్పారు. ఆ నగదును ఉత్తమ్‌కుమార్, చైతన్యరెడ్డి యూనివర్సిటీ ద్వారా వెనక్కి తీసుకున్నారని తెలిసింది. దీంతో మోసపోయానని తెలుసుకొని మరోమారు ఫీజు చెల్లించి కళాశాలలో చేరారు. తన వద్ద రూ.24 లక్షలు తీసుకొని మోసగించిన ఇద్దరిపై చర్యలు చేపట్టాలని వేదాయపాళెం పోలీసులకు నరసింహరావు ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలకు చేరువయ్యేలా సమష్టిగా పనిచేద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులు, విద్యాశాఖ అధికారులతో సమావేశాన్ని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు.. అర్హులై సంక్షేమ పథకాలు అందని వారి వివరాలపై సమీక్ష సమావేశాలను నిర్వహించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను ఈ నెల 24న నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ బస్టాండ్ ప్రారంభం

ఆత్మకూరులో నిర్మించిన ఎమ్జీఆర్ మున్సిపల్ బస్టాండ్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులతో సమావేశాన్ని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఆత్మకూరులో సర్వాంగ సుందరంగా నిర్మించాలనుకున్న మున్సిపల్ బస్టాండ్ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో నిలిచిపోయిందన్నారు. ఈ క్రమంలో తమ సొంత నిధులతో ఎమ్జీఆర్ ఫౌండేషన్, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా నిర్మించామని తెలిపారు. బస్టాండ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు



నెల్లూరు రూరల్: పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సును మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రాయల్ పార్క్ హోటల్లో సింహపురి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పోటీ పరీక్షలను ఒత్తిడి లేకుండా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. వివిధ అంశాలను ఒంగోలు అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్, గ్రూప్ – 1 ర్యాంకర్ వంశీకృష్ణ, హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఫ్యాకల్టీ వీరాస్వామి, మహేష్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ వంశీకృష్ణ తెలియజేశారు.

25న పాటలు, డ్యాన్స్ పోటీలు



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): ఏవీకే ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి పాటలు, డ్యాన్స్ పోటీలను నగరంలోని పురమందిరంలో ఈ నెల 25న నిర్వహించనున్నామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పొదలకూరు రోడ్డులోని జీఎమ్మార్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మురళీకృష్ణ, యశోదరాణి పాల్గొన్నారు.